www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 18 నవంబర్ 2023
5

## బిటెక్ రవిని కస్టడీకి ఇవ్వాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు

ప్రజాశక్తి-కడప రూరల్

వైయస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బిటెక్ రవి)ని ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలన్న పోలీసుల పిటిషన్‌ను కడప కోర్టు కొట్టివేసింది. ఈ నెల 14న వల్లూరు పోలీసులు బిటెక్ రవిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ వల్లూరు పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కడప కోర్టు శుక్రవారం కొట్టివేసింది. మరో వైపు బిటెక్ రవి బెయిల్ పిటిషన్‌పై విచారణను కడప కోర్టు ఈనెల 21కి వాయిదా వేసింది.

# ప్రభుత్వ విద్యా రంగం నిర్వీర్యం

### యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

పాలకులు సంస్కరణల పేరుతో విద్యారంగంలో వినాశకర విధానాలు అమలు చేస్తున్నారని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ చెప్పారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్‌లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అమలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 117 వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది పాఠశాలలో మూసివేతకు గురయ్యాయని, 11 వేల ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అందులో భాగంగానే ఉపాధ్యాయుల ఏ ఒక్క సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. జూన్‌లో ఉపాధ్యాయ బదిలీలు జరిగాయని, అప్పటి నుంచి క్యాడర్ స్ట్రెంత్ ఆప్డేషన్ పేరుతో 250 మంది ఉపాధ్యాయులకు ఐదు నెలలుగా జీతాల చెల్లింపులు లేవన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖ పరిధిలోకి తెచ్చి ఏడాది కాలం ముగిసినా ఇప్పటివరకు వారి సర్వీసును విద్యాశాఖ నిర్ధారించలేదన్నారు. దీంతో మునిసిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జరగలేదన్నారు. గతంలో ఉన్న సర్వీస్ రూల్స్‌ను అమలు చేసైనా అవసరమైన స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయ పోస్టులను సృష్టించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు రేషనలైజేషన్ నిర్వహించి వెంటనే బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మునిసిపల్ కమిషనర్ల వద్ద ఉన్న తమ పిఎఫ్ సొమ్మును సైతం డ్రా చేసుకోలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ వెంటనే స్పందించి మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిసెంబర్ మాసంలో తగు కార్యాచరణ రూపొందించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. డిసెంబర్ 9,10 తేదీలలో ఏలూరు జిల్లాలో యుటిఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నారని, ఇందులో విద్యా రంగంలో పాలకులు చేపట్టిన సంస్కరణలపై చర్చిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల హామీగా ఇచ్చిన సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ అమలు విధానంపై మాట తప్పి జిపిఎస్ విధానాన్ని అమలు చేయడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ధ్యేయంగా కార్యాచరణ రూపొందించి పోరుబాటుకు పిలుపునిస్తామని ఆయన తెలిపారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించామని అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించడంతోపాటు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు, సహాధ్యక్షుడు వై.రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

డ్రమ్ములోని వృథానీటిని పారవేస్తున్న ఆశా కార్యకర్తలు

దోమల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రంగ సముద్రం పంచాయతీ పరిధిలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, దోమల లార్వా నియంత్రణ, డెంగు, మలేరియా, చికెన్ గున్య, ఫైలేరియా, వైరల్ ఫీవర్స్, మొదలగు, జాతీయ కీటక జనిత వ్యాధుల గురించి, ప్రజలకు అవగాహన కల్పించారు. లార్వా, దోమల నియంత్రణ, వాటి నివారణ, గురించి ప్రజలకు రచ్చ బండ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. దోమల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని తెలియజేశారు. ప్రతి శుక్రవారమూ ఇంటింటికి వెళ్లి దోమ లార్వ నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి, వాటిని నివారించాలని పేర్కొన్నారు. అనంతరం ఎస్‌సి మహిళా బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, ఫీవర్ కేసెస్, పరిసరాల పరిశుభ్రత, బాత్ రూమ్స్, బెడ్ రూమ్స్, విండోస్, మెస్‌లు ఏర్పాటు గురించి పర్యవేక్షణ చేశారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు అట్లూరు సిహెచ్‌ఒ సి.మురళీ కృష్ణ, బద్వేల్ హెచ్ ఇ యంగయ్య, సిహెచ్‌ఒ చిన్నపుల్లయ్య, హెచ్‌ఇ సాధు వెంకటేశ్వర్లు, పోరుమామిళ్ల, హెచ్‌ఎస్ శివరామి రెడ్డి, ఎఎన్ఎం నిర్మలమ్మ, రంగసముద్రం-1 కుమారి, ఐశ్వర్య, కుమారి, ప్రియాంక, శ్రీమతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసులకు 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు'

**కడప అర్బన్ :** పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో ఇటీవల ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరచిన వారికి 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు'ను అందచేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ముగ్గురు సివిల్, ఒక ఏఆర్ సిబ్బందిని ఎంపిక చేసి వారికి జిల్లా పోలీస్ కార్యాలయంలో నగదు రివార్డు, ప్రశంసా పత్రాలను అందచేసి అభినందించారు.

## రేపు పెద్ద స్క్రీన్‌పై ఫైనల్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం

**కడప :** భారత్- ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈనెల 19న నిర్వహించే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను కడప నగర వాసుల కోసం ఆర్ట్స్ కళాశాలలో పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు భరత్ రెడ్డి, కార్యదర్శి ఏ.రెడ్డి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు భరత్ రెడ్డి, కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, సంజయ్ కుమార్ రెడ్డి కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రేక్షకులు, అభిమానులు మ్యాచ్‌ను సజావుగా తిలకించే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

## భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్

**కడప :** సచివాలయ భవన నిర్మాణాలతో పాటు ప్రాధాన్యత రంగాలకు సంబంధించిన అన్ని రకాల భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామారాజు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల పురోగతిపై పిఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్మిస్తున్న సచివాలయ భవనాలు, కేటగిరీ-2 కింద చేపట్టిన బిఎంసియులు, డిజిటల్ లైబ్రరీ నిర్మాణాల విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సచివాలయాల పరిధిలో చేపట్టిన నిర్మాణ పనులను ఎక్కడా కూడా పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాసుల రెడ్డి, పిఆర్ ఇఇ, డిఇలు రామచంద్రా రెడ్డి, శ్యాం సుందర్ రాజు, ఎఇలు సంబంధిత మండల ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి : సిఐటియు

**బద్వేలు :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని సిటైఐయు జిల్లా కార్యదర్శులు కె. శ్రీనివాసులు, కె. నాగేంద్రబాబు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేశారని తెలిపారు. కార్మికుల హక్కులను పునరుద్ధరించాలని, పని ప్రదేశంలో సమానత్వాన్ని, భద్రతను పెంచాలని, అసంఘటిత రంగ కార్మికులను రిజిస్ట్రేషన్ చేసి వారికి పెన్షన్ తో సహా సామాజిక భద్రత అందించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఇఎస్ఐ వర్తింపజేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు రాయప్ప, నరసింహులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

**బద్వేలు :** యుటిఎఫ్ గోపవరం మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. శుక్రవారం సాయంత్రం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గోపవరం మండల కౌన్సిల్ సమావేశాల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మాతంగి వెంకటసుబ్బయ్య, అధ్యక్షులుగా వీరదాసరి క్రిస్టఫర్, సహాధ్యక్షులుగా పి.విశ్వనాథరెడ్డి, జి.అనురాధ, ప్రధాన కార్యదర్శిగా వి.కృష్ణుడు, ట్రెజరర్‌గా ఎం.రామచంద్రయ్య, కార్యదర్శులుగా కె.ఓబులేసు, శ్రీనివాసులు, ఎం.బాబు, టి.సుబ్రహ్మణ్యం, యన్..నరసింహులు, ఎం.వెంక టరమణ, కె.వీరారెడ్డి, పి.బాల ఓబన్న , ఎం.శివ ప్రసాద్, సతీష్‌ను ఎన్నుకు న్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎస్.ఓబుల్ రెడ్డి, వీరదాసరి క్రిస్టఫర్, వి.కృష్ణుడు, ఎం.దస్తగిరి, బి.ఓబన్న, మల్లెం కొండయ్య, జె.మణికుమార్, కె.రమణయ్య, సి.హెచ్.వెంకట రమణ ఆడిట్ కమిటీ కన్వీనర్ సి.నరసిం హనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పరిశీలకులుగా జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్, ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్. ఓబుల్ రెడ్డి వ్యవహరించారు.

## పేదలను ఆదరించాలి

**ప్రొద్దుటూరు:** పేదలను ఆదరించి అక్కున చేర్చుకున్నప్పుడే మహాత్మాగాంధీ కలలు గన్న సమసమాజం ఆవిష్కృతమవుతుందని మున్సిపల్ వైస్-ఛైర్మెన్ ఆయిల్‌మిల్ ఖాజా అన్నారు. 'ఎపికి జగన్ ఎందుకు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 12వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొంపలపుల్లన్న వీధిలోని లోమడ ఓబులమ్మ అనే వృద్ధురాలికి తన జీవనోపాధికోసం ఇస్త్రీపెట్టెను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవితాలు బాగుపడాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతిగా ఉన్నారన్నారు. పేదలు మధ్యతరగతి కుటుంబీకులు బాగుపడాలని పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు గృహసారథులు కన్వీనర్లు పాల్గొన్నారు.

## బాబుతోనే సుస్థిర అభివృద్ధి

**కడప అర్బన్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సుస్థిర అభివృద్ధి సాధిస్తుందని టిడిపి సీనియర్ నాయకులు ఆలం ఖాన్ పల్లె లక్ష్మారెడ్డి, కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మన్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని 10వ డివిజన్‌లో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సైకో పాలనలో అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. అవినీతి, కబ్జాలు, భూ దందాలు పెరిగిపోయాయని తెలిపారు. ప్రజలు తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోనికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. టిడిపి ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, డివిజన్ మాజీ అధ్యక్షురాలు మేకల విజయలక్ష్మి, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, మేకల వెంకటేష్ యాదవ్, జయరామిరెడ్డి, ఓబుల్ రెడ్డి, విట్టల్, చిన్న గురయ్యా, రామచంద్రయ్య, సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ, రంగనాయకులు, రంగా, జామంతయ్య, నడిపి సుబ్బయ్య, సుబ్బరాయుడు, సాంబశివ, కొండయ్య, కుండ బాబు, పిచ్చయ్య, సుధాకర్ రెడ్డి, నారాయణరెడ్డి, పల్లె సుధాకర్ రెడ్డి, న్యాయవాది లింగాల శివశంకర్ రెడ్డి, మీనాక్షి, స్వర్ణలత, మల్లేశ్వరి, ఉమాదేవి పాల్గొన్నారు.

## బహుభాషా కవి సమ్మేళనం

**కడప అర్బన్ :** 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బహుభాషా కవి సమ్మేళనం నిర్వహించారు. సభాధ్యక్షులుగా ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వరరెడ్డి వ్యవహరించారు. తెలుగు, సంస్కృతం, ఉర్దూ భాషలలో తమ కవితలను వినిపించారు. కవితల్లో మానవత్వమే మిన్న అంటూ తెలుగు ,ఉర్దూ గజల్స్ , రూపంలో లో చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బి సి సంక్షేమ అధికారి డాక్టర్ వల్లూరి బ్రహ్మయ్య,లయన్ పద్మప్రియ చంద్రరెడ్డి పాల్గొన్నారు. **వక్తృత్వ పోటీలకు విశేష స్పందన :** 56 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవల నాల్గవ రోజున విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 20 స్కూల్స్ నుంచి వచ్చిన154 మంది విద్యార్థులువక్తృత్వ పోటీలకు హాజరయ్యారు. విజేతలకు ఈనెల 19న బహుమతులు ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో అరుణ, రజని, పుష్పరాజు,డిప్యూటీ లైబ్రేరియన్స్ పవన్, బాబ్జి, సుబ్రమణ్యం, సురేష్, నవాబ్ జాన్, జేమ్స్, శ్రీనివాసులు, శేఖర్,రమణ, విద్యార్థులు పాల్గొన్నారు. **నేడు వివిధ దేశాల నాణేల ప్రదర్శన :** శనివారం వివిధ దేశాల నాణేలను ప్రదర్శించనున్నారు. మన దేశంతోపాటు విదేశీ నాణేలను ప్రదర్శనలో ఉంచుతామని విద్యార్థులు,ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కార్యదర్శి అమీరుద్దీన్ కోరారు.

కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - కడప

ముఖ్యమంత్రి ప్రసంగాన్ని విసి ద్వారా వింటున్న జెసి, డిఆర్‌ఒ

రాష్ట్ర ప్రభుత్వం హక్కుదారులకు స్వేచ్ఛయుత సంపూర్ణ భూహక్కును కల్పించడంతో పాటు కొత్తగా వేలాది ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయడం అభినందనీయమని జెసి జి. గణేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో బహిరంగ సభ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దళితులకు శ్మశాన వాటికలతో పాటు ఇతర పేదలకు భూముల కేటాయింపు పత్రాల్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లా జేసీ గణేష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్యక్రమం ముగిసిన అనంతరం జెసి మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి కొత్తగా 1,818 మంది పేదలకు 2683.65 ఎకరాల అసైన్డ్ భూముల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 138 గ్రామల పరిధిలో దళితుల శ్మశాన వాటికలకు 95.23 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. జగనన్న దళిత సంపూర్ణ భూ హక్కు పథకం ద్వారా ల్యాండ్ పర్చేజ్ స్కీం కింద ఎస్సీ కార్పొరేషన్ పంపిణీ చేసిన 1910.54 ఎకరాల భూములపై 1,738 మందికి సర్వ హక్కులు కల్పిస్తూ వారి రుణాలు కూడా మాఫీ చేసిందన్నారు. దేశంలోనే తొలిసారి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. వందేళ్ల తర్వాత జగనన్న భూ హక్కు పథకం ద్వారా చేపట్టిన భూముల రీ సర్వే ద్వారా జిల్లాలో రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటి వరకు రెండు విడతల్లో అన్ని డివిజన్ల పరిధిలో 49,701 మందికి సంబంధించి రీసర్వే పూర్తి చేశారన్నారు. అన్ని భూ వివాదాల జిల్లాలో 99.98 శాతం పరిష్కారం చేసి గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. 20 ఏళ్లు పైబడ్డ అసైన్డ్ భూములను, గ్రామ సర్వీసు ఇనామ్ భూములను, ఎస్సీ కార్పొరేషన్ పంపిణీ చేసిన భూములను సెక్షన్ 22-ఏ నుంచి తొలగించి ఈ భూములను సర్వ హక్కులతో క్రయ విక్రయాలకు, రుణాలు పొందడానికి, తనఖా పెట్టుకోవడానికి, బహుమతిగా ఇవ్వడానికి, వారసత్వపు ఆస్తిగా అందించడానికి, సొంత ఆస్తిగా అనుభవించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డాక్టర్ హెచ్ వెంకట సుబ్బయ్య, ల్యాండ్స్ సర్వే అధికారులు, రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు హాజరయ్యారు.

## ట్రిపుల్‌ఐటి డైరెక్టర్‌గా కుమారస్వామి గుప్తా

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా కుమార స్వామి గుప్తాని ఆర్‌జెయుకెటి ఉన్నతాధికారులు నియమించారు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ జెఎన్‌టియులో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కుమార స్వామి గుప్తాని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ గా బదిలీ చేశారు. త్వరలో ఆయన డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం డైరెక్టర్‌గా ఉన్న సంధ్యారాణి బదిలీపై వెళ్తున్నారు. ఒంగోలు ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా భాస్కర్ పటేల్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా చంద్రశేఖర్, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీ నుంచి బాలాజీని తెలిసింది. అధికారికంగా ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ అధికారులు పేర్లను ప్రకటించాల్సి ఉందని ట్రిపుల్ ఐటిఅధికారులు అంటున్నారు.

## నేడు, రేపు ప్రెస్ అకాడమీ చైర్మన్ జిల్లా పర్యటన

**కడప :** రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈనెల 18, 19 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నారని రాష్ట్ర ప్రెస్ అకాడమీ సెక్రెటరీ ఎం. బాలగంగాధర తిలక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4.30-5.30 గంటల మధ్య ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయాన్ని సందర్శిస్తారన్నారు. కడప ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాత్రి బస చేసి మరుసటి రోజు ఉదయం 8.10 గంటలకు అమీన్ పీర్ (పెద్ద దర్గా) ను సందర్శిస్తారని తెలిపారు. అనంతరం 9.00 గంటలకు దేవుని కడప ఆలయాన్ని సందర్శించి తదనంతరం మార్కాపురానికి బయలుదేరి వెళతారని తెలిపారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎన్‌సిసి

ప్రజాశక్తి - కడప

శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు, దేశానికి సేవ చేయడానికి ఎన్‌సిసి ఎంతగానో ఉపయోగపడుతుందని 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టి నెంట్ కల్నల్ రాజ్ కుమార్ థాపా అన్నారు. శుక్రవారం 30 ఆంధ్ర బెటాలియన్ ప్రాంగణంలో 12వ కంబైన్డ్ యాన్యువల్ ట్రెనింగ్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపు ఈనెల 26 వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో డ్రిల్, మ్యాప్ రీడింగ్, నాయకత్వ లక్షణాలు, ఫీల్డ్ క్రాఫ్ట్, బాటిల్ క్రాఫ్ట్, ఫైరింగ్, ఆయుధ శిక్షణ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. క్యాంపులో కడప, అన్నమయ్య, అనంతపురం, తిరుపతి, చిత్తూరు, సత్యసాయి జిల్లాల నుంచి దాదాపు 600 మంది ఎన్‌సిసి క్యాడెట్లు హాజరవుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య, మహేష్, రాజు పరేడ్ శిక్షకులు అశోక్, గోపాల్ రెడ్డి, ఆఫీసు సిబ్బంది, సూపరిండెంట్ సరస్వతి, డేవిడ్, ఉమా ప్రియా, రాజగోపాల్ రెడ్డి, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

## రచయితల సభల్లో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప నగరంలో డిసెంబరు 23, 24 తేదీలలో రచయితల మహాసభలను నిర్వహిస్తున్నామని ఇందులో పలు అంశాలలో భాగస్వామ్యం పొందేందుకు పలువురు రచయితలు, కవులు, సాహిత్యాభిలాషులు, కార్యకర్తలకు అవకాశం కల్పిస్తున్నామని రచతయిల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మహాసభల్లో రెండు రోజుల పాటు సాహిత్య ప్రసంగాలు, పత్ర సమర్పణలు, పలు రకాల సాహిత్య ప్రక్రియల ప్రదర్శనలు, పుస్తక ప్రదర్శనలు, సావనీర్‌లు, జిల్లా రచయితల పుస్తకాల ప్రదర్శన అమ్మకాలు, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాకు చెందిన రచయితలు తాము రాసిన పుస్తకాలను ప్రదర్శనలో ఉంచేందుకు సంఘ అధ్యక్షులను కనీసం 20 రోజుల ముందు సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ఇంతకుముందు నిర్వహించిన జిల్లా రచయితలు, అభ్యుదయ రచయితల సంఘాల మహాసభలకు సంబంధించిన సావనీర్‌లు కరపత్రాలు, కవుల రచయితల ప్రసంగ పాఠాలు, ఫొటోలు ఉంటే తమకు తెలపాలని వాటిని ప్రదర్శనలో ఉంచేందుకు ఏర్పాటుచేస్తామని తెలిపారు. జిల్లాకు సంబంధించి చరిత్ర, భౌగోళిక అంశాలు, ఇతర సాహిత్య రూపకాల పుస్తకాలు ఉన్నవారు కూడా తమ పుస్తకాలను ఈ ప్రదర్శనలో ఉంచేందుకు సంప్రదించాలని కోరారు. ప్రదర్శనకు యోగ్యమైన ఏ ఇతర సామగ్రి తమ వద్ద ఉన్నా ఆ విషయం తమకు తెలపాలన్నారు. పాఠశాలలు, కళాశాలల నిర్వాహకులు తమ సంస్థ ద్వారా ప్రతిష్టాత్మకమైన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించదలచుకుంటే 7700003399, 9704651414లలో సంప్రదించాలని సూచించారు.

## హెచ్ఐవిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

ప్రజాశక్తి- కడప

హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని, సామాజిక దృక్పథం కలిగి ఉండాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవిబాబు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిఎపిసియు సహకారంతో జిల్లాస్థాయి 'రెడ్ రిబ్బన్ క్లబ్స్', యూత్ అవేర్నెస్ మాస్టర్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నేటి యువత ఎదుర్కొంటున్న సమస్యలను, వాటిని తీర్చిదిద్దడంలో పాత్రను గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అన్ని డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ పొదిలి నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ జువాలజీ డాక్టర్ వీర నాగేంద్ర కుమార్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, సూపర్వైజర్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే

## సచివాలయ వ్యవస్థతో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి విప్లవాత్మక పాలనకు శ్రీకారం చుట్టారని ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు మండలంలోని వనిపెంటలో నూతనంగా రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వై.ఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజల వద్దకే పాలన అందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నాగిరెడ్డి , రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం , జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రెసిడెంట్ మదీనా దస్తగిరి, వనిపెంట గ్రామ సర్పంచ్ గౌస్ లాజం , మండల నాయకులు కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'బిసిలను అణగదొక్కుతున్నారు'

### - బిసి నాయకులు ఓబయ్య యాదవ్

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి పాలనలో బిసిలను అణగదొక్కుతున్నారని మైదుకూరుకు చెందిన ప్రముఖ బిసి నాయకులు చలమల ఓబయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై.ఎస్. కుటుంబం అంటే తమకు పంచప్రాణాలని పేర్కొన్నారు. ఉన్న ఆస్తులు అమ్ముకుని పార్టీ కోసం 20 ఏళ్లుగా కష్టపడి పని చేస్తున్నామని తెలిపారు. 2014లో మున్సిపల్ ఛైర్మన్‌గా తనను పోటీ చేయమని స్వయానా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పారని పేర్కొన్నారు. పోటీ చేసేందుకు 100 ఎకరాల భూమిని సైతం పోగొట్టుకున్నామని వాపోయారు. 2019లో మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పనులకు సంబంధించి టెండర్లు వేశామని చెప్పారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి టెండర్లను రద్దు చేయించి 'ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో పో' అంటూ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్లుగా న్యాయం చేస్తామని సీఎం, ఎంపీ అవినాష్ రెడ్డి చెబుతూ వచ్చారని పేర్కొన్నారు. ఎంపీ ని కాళ్లు పట్టుకున్నా కనికరించలేదని వాపోయారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షులు సురేష్ బాబుకు అందజేస్తున్నానని చెప్పారు. సమావేశంలో ఓబయ్య యాదవ్ భార్య లక్ష్మీ పాల్గొన్నారు.

## ఆచార్య కొర్లకుంట ఆనందన్ మృతికి సంతాపం

**కడప అర్బన్ :** యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ రిటైర్డ్ ఆచార్యులు ఆచార్య కొర్లకుంట ఆనందన్ మృతికి సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఆనందన్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాల్లో తెలుగుశాఖ ఆచార్యులుగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. తెలుగు భాషా సాహిత్యాలకు ఆయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఆనందన్ అనేక సాహితీ సభల్లో చురుగ్గా పాల్గొనేవారని గుర్తుచేశారు. సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ ఆనందన్ మృతి అటు విద్యార్థులకు, ఇటు సాహితీలోకానికి తీరని లోటని అన్నారు. ఆయన చేసిన సాహిత్యకృషి తెలుగు సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదిం చుకుందన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటమరణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

బాలోత్సవం కన్వీనింగ్ కమిటీ వివిధ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 3 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 897 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు పీస్ స్కూల్ విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పీస్ స్కూలు డైరెక్టర్ సయ్యద్ గౌస్‌పీర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు షేక్. షాహిద్ 8వ తరగతి, సయ్యద్ నఫీసా 5వ తరగతి, పఠాన్ ఫాతిమా ఖానం 5వ తరగతి, షేక్. ఆఫియా తస్నీమ్ 3 వ తరగతి బహుమతులు గెలుచుకున్నారని పేర్కొన్నారు. తమ పాఠశాలలోని పిల్లలకు చదువుతో పాటు చిత్రలేఖన, కరాటే, ఆటలలో మంచి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. చిత్రలేఖన పోటీలలో పాల్గొని బహుమతులు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

బహుమతి పొందిన విద్యార్థులతో డైరెక్టర్ గౌస్‌పీర్

లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎనిమిది లబ్ధిదారులకు రూ.5,29,000 సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగకరమని చెప్పారు. మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతో సాయపడుతుందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులు ఎమ్మెల్యే ప్రత్యేక కృషికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి మైలవరం మండలం ఇన్‌ఛార్జి దొడియం విష్ణువర్ధన్ రెడ్డి, దన్నవాడ మహేశ్వర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గడప గడపకూ సంక్షేమ ఫలాలు

**- సర్పంచ్ రాజుల రాజేశ్వరి, వైసిపి నాయకులు రాజుల శంకర్‌రెడ్డి**

**ప్రజాశక్తి - ముద్దనూరు**

రాజుల శంకర్‌రెడ్డి, రాజుల రాజేశ్వరి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందిస్తూ రాష్ట్రాభివృద్ధి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని రాజుల గురువాయపల్లె సర్పంచ్ రాజుల రాజేశ్వరి, రాజుల శంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం పథకాలను అమలు చేసి అందిస్తుందన్నారు. జగనన్న రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చి దిద్దుతున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విప్లవాత్మకమైన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. అన్ని వర్గాలకు సమానంగా సంక్షేమ ఫలాలు అందిస్తుందని తెలిపారు. జగనన్న కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రయోజనం ప్రజల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం నిత్యం పాటుపడుతుందన్నారు. వైసిపి ప్రభుత్వమని జగన్ పాలన మార్పు నిరూపించారన్నారు. సిఎం, ఎంపీ అవినాష్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మండల, గ్రామాల, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. రాజులగురువాయపల్లె గ్రామ పంచాయతీని గ్రామాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించి ఆదర్శ పంచాయతీగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను మరింత చేరువ చేరుస్తామన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల, ప్రజల సమస్యల పరిష్కారంచేందుకు కృషి చేస్తామన్నారు. వైసిపి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి పార్టీ అధికారంలోకి వచ్చేలా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు పాటుపడతానన్నారు. ప్రజలు తమ అమూల్యమైన ఓటును వైసిపికి వేసి ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎమ్మెల్యేగా సుధీర్ రెడ్డిని అత్యంత మెజారిటీతో గెలిపించాలని రాజేశ్వరి, శంకర రెడ్డి కోరారు.

## దిశ యాప్‌పై మహిళలకు అవగాహన

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పట్టణంలోని స్థానిక పూలంగళ్ల కూడలి వద్ద మహిళలకు దిశ యాప్ ఆవశ్యకతను తెలియజేస్తూ, వారి మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేశారు. శుక్రవారం ఎఎస్‌ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ మహేష్, మహిళా కానిస్టేబుల్ సునీత దిశ యాప్ ప్రయోజనాల గురించి మహిళలకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ మొబైల్ లో దిశా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని ఆపద సమయంలో ఉపయోగించుకోవాలని తెలిపారు. **దువ్వూరు:** ప్రతి మహిళా దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. బాలికలు, మహిళల రక్షణకు యాప్ చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో దువ్వూరు స్థానిక పోలీసులు పాల్గొన్నారు. **కొండాపురం :** రోజురోజుకూ పెరుగుతున్న నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయడానికి కొండాపురం పోలీసులు నడుం బిగించారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రజల వద్దకు వెళ్లి దిశ యాప్ ఆవశ్యకతను మహిళలకు వివరించారు. ప్రతి మహిళా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వలన కలిగే లాభాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు

## బాలప్ప కోనకు రహదారి పునరుద్ధరణ

**ప్రజాశక్తి - కొండాపురం**



మండలంలోని ఎర్రమల కొండలలో వెలసిన దక్షిణ భూ కైలాసంగా పేరుపొందిన శ్రీ బాల మల్లేశ్వర స్వామి క్షేత్రం (బాలప్ప కోన)కు తిరిగి రహదారి ఏర్పాటు చేశారు. కోనకు గతంలో తాళ్ళప్రొద్దుటూరు మీదుగా రహదారి ఉండేది. ఆ రహదారి 2020లో గండికోట ప్రాజెక్టులో నీరు ఎక్కువ రావడంతో రహదారి మునిగిపోయింది. ప్రస్తుత గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం బాగా తగ్గిపోయినందున బొందల దిన్నె గ్రామం నుండి సంకేపల్లి దర్గా దగ్గర, చామలూరు, ఎర్రగుడి గ్రామాల మీదుగా పూర్వపు దారిని పునరుద్ధరించామని ఆలయ నిర్వాహకులు మిట్ట భాస్కర్ రెడ్డి తెలిపారు. బొందల దిన్నె గ్రామంలో నుండి కోనకు 12 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రహదారి బాగా ఏమాత్రం దెబ్బ తినకుండా ఉంది. భక్తాదులందరూ బాలప్పకోన పాత రహదారిని ఆలయం చేరుకోవచ్చని మిట్ట భాస్కర్ రెడ్డి తెలియచేశారు. కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని బాలప్పకోనలో నిత్యాన్నదానం చేస్తున్నారని తెలిపారు.

## రామకృష్ణ ధ్యాన కేంద్రంలో శ్రమదానం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

మండల పరిధిలోని కామనూరులో ఉన్న భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస ధ్యాన కేంద్రంలో వివేకానంద ఫౌండేషన్ సంస్థ సభ్యులు శుక్రవారం శ్రమదానం చేపట్టారు. ఆవరణంలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. పుస్తక సంపత్తి నిధిని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పోపిశెట్టి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కామనూరు గ్రామానికి నారాయణానంద స్వామి శ్రీ రామకృష్ణ పరమహంస ధ్యాన కేంద్రం నిర్మించారన్నారు. కొందరు ఇక్కడ ప్రశాంతమైన వాతావరణంలో ధ్యానం చేసుకున్నారు శుభ్రత కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలు, యువత కేంద్రంలో అందుబాటులో ఉన్న వివేకానందుని సాహిత్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పిప్పళ్ల బాలనాగిరెడ్డి, బి. వెంకట సురేష్ పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**ఎర్రగుంట్ల :** పట్టణ పరిధిలోని సాయి సిద్ధార్థ పాఠశాల వద్ద శుక్రవారం ఉదయం రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. మోతాది శ్రీనివాసులు (45) అనే వ్యక్తి పట్టణంలోని నాపరాయి మిషన్ల వద్ద కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం కూలి పని కోసం మహేశ్వర్ నగరలోని తన నివాసం నుంచి వెళుతుండగా రైల్వే ట్రాక్ దాటే క్రమంలో జువారి కర్మాగారానికి వెళుతున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి ఒంటరిగా జీవిస్తుండడంతో పోలీసులు మృతుని బంధువుల గురించి ఆరాతీస్తున్నారు.

# ప్రభుత్వ స్థలం.. పరుల పాలు

### దర్జాగా ఆక్రమణ
### ప్రభుత్వ భవనాన్ని కూల్చిన ప్రయివేట్ వ్యక్తులు
### చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

ప్రభుత్వ స్థలంలో వితంతు కార్యం కోసం నిర్మించిన భవనం, ముందు బాగాన్ని కూల్చిన ఆక్రమణదారులు

ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో ఏళ్ల తరబడి మహిళల వితంతు కార్యం కోసం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఊర బావి వద్ద ఉన్న స్థలాన్ని వినియోగిస్తున్నారు. దాదాపు 20 సంవత్సరాల కిందట అప్పటి సర్పంచ్ తుపాకుల రామసుబ్బారెడ్డి హయాంలో ఊర బావిని పూడ్చి పంచాయతీ నిధులతో వితంతువుల కార్యక్రమాల సౌకర్యార్థం గదులను నిర్మించారు. ప్రభుత్వ ఆధీనంలోని ఊర బావి సర్వే నెంబర్ 573 లోని 0.17 సెంట్ల స్థలంలో కొద్ది భాగాన్ని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలకు కేటాయించారు. మిగిలిన స్థలం చుట్టూ ప్రహరీ గోడను కూడా నిర్మించారు. అటువంటి స్థలంలో ఉన్న ప్రభుత్వ భవనాన్ని కొందరు ప్రయివేట్ వ్యక్తులు ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా కూల్చడంతో ప్రజల్లో విమర్శలు వెలువెత్తు తున్నాయి. ఆ స్థలంలో చందాలు వేసి అక్కడ గదులు నిర్మిస్తున్నట్లు, వాటి ద్వారా వచ్చిన బాడుగల మొత్తాన్ని నడిఊరు రామాలయానికి ధూప దీప నైవేద్యాల కొరకు ఖర్చు చేస్తున్నారనే సమాచారం నగర పంచాయతీలో చక్కర్లు కొడుతోంది. ఈ విషయం పై ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్‌ను ప్రశ్నించగా పట్టా భూమి అంటూ తన దృష్టికి తెచ్చారని తర్వాత విచారణ చేయగా అది ప్రభుత్వ భూమి అని తేలడంతో ప్రభుత్వ స్థలంలో ఉన్న భవనాన్ని కూల్చిన వ్యక్తులను పిలిపించి మాట్లాడినట్లు ఆయన తెలిపారు. భవనం పాతది కావడంతో కూల్చి కొత్త భవనాన్ని నిర్మిస్తున్నామని సంబందిత వ్యక్తులు తెలిపినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఆయన రెండు ధోరణుల మాటలు విన్న ఎవరికైనా సందేహాలు కలుగక మానవు. సుమారు 20 సంవత్సరాల కిందట ఒకే భవనాన్ని రెండు గదులుగా వరండాగా నిర్మాణం చేశారు. ప్రయివేటు వ్యక్తులు వరండాను, వరండా అనుకుని ఉన్న గదిని కూల్చారు. అలాగని వెనకాల ఉన్న గది నూతనంగా నిర్మించారా అంటే అదీ లేదు. వరండాను కూల్చిన వారు... ఎందుకు ఆ గదిని కూల్చలేదు అనే సందేహాలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. కొన్నేళ్లుగా ఊరబావి వద్దకు వితంతు కార్యక్రమానికి వచ్చే మహిళలకు నీటి సౌకర్యం, కావలసిన సదుపాయాలు కల్పించిన దాఖలాలు లేవు. దాదాపు రూ.15 లక్షలు ఖర్చు చేసి నూతన భవనాన్ని హిందూ వాదులమంటూ చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు నిర్మిస్తున్నారని చెప్తుంటే ప్రజల్లో సందేహాలు వస్తున్నాయి. ఈ సంగతులన్నీ పక్కన పెడితే ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాన్ని ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా ఎలా కూల్చుతారాంటూ పలువురు మండిపడుతున్నారు. వారికి ఆ హక్కు ఎవరిచ్చారుంటూ ప్రశ్నిస్తున్నారు. వీరి వెనకాల రాజకీయ నాయకుల, అధికారుల హస్తం ఉందని గుసగుసలాడుతున్నారు. అక్రమంగా ప్రభుత్వ స్థలంలోకి చొరబడి అక్కడున్న భవనాన్ని కూల్చిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు. ఈ విషయంపై త్వరలో కలెక్టర్‌ను కలిసే ఆలోచనలో ప్రజలు ఉన్నట్టు తెలిసింది.

### సమావేశంలో చర్చించి అనుమతులు : కమిషనర్

చివరగా ఆ స్థలంలో భవనాన్ని నిర్మించడానికి కౌన్సిల్ ఎజెండాలో పొందుపరిచి, తీర్మానించిన తర్వాతే అనుమతులు మంజూరు చేస్తాం. అంతవరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టబోమని కమిషనర్ జగన్నాథ్ తెలిపారు.

# వెలవెలబోతున్న ట్రిపుల్‌ఐటిలు : పిసిసి

**ప్రజాశక్తి - వేంపల్లె**

విలేకరులతో మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఐటిలు కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో కళకళలాడుతుండేవని, ప్రస్తుత వైసిపి పాలనలో వెలవెలబోతున్నాయని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిభావంతులైన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉన్నత సాంకేతిక విద్యను అందించాలన్న గొప్ప ఆశయంతో 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయాన్ని స్థాపించినట్లు చెప్పారు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలోని ఇడుపులపాయలో, కృష్ణా జిల్లా నూజివీడుతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని బాసరలో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారని చెప్పారు. తర్వాత టిడిపి ప్రభుత్వం శ్రీకాకుళం, ఒంగోలుతో మరో రెండు ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చే వరకు ట్రిపుల్ ఐటిలకు నిధులు సమృద్ధిగా వచ్చేవని చెప్పారు. దీంతో ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలు కళకళలాడేవని తెలిపారు. దురదృష్టవశాత్తు జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ట్రిపుల్ ఐటిలకు సకాలంలో సరిపడా నిధులు విడుదల కాక పోవడంతో నిర్వహణ లోపంతో వెలవెల లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి అడవి ప్రాంతంలో ఉండడంతో విష సర్పాలు, అడవి జంతువులు క్యాపస్‌లోకి వస్తున్నాయని చెప్పారు. కొత్త క్యాంపస్‌లో ఉన్న బాలుర హాస్టల్ గదిలోకి కొండ చిలువ వచ్చి మంచం కింద చుట్టుకొని ఉందని తెలిఆపరు. సకాలంలో విద్యార్థులు చూసి సమాచారం ఇవ్వడం వల్ల ప్రమాదం తప్పిందని లేకపోతే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని చెప్పారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు అపరిశుభ్రంగా ఉన్నాయాని చెప్పారు. ఇంటర్నెట్ కూడ పని చేయక పోవడం దారుణమని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తరుచు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొన్న సంఘటనలు కూడ ఉన్నట్లు చెప్పారు. విద్యార్థుల పట్ల మేనమామగా ఉంటానని చెప్పుతున్న సిఎం జగన్ శకుని మామాగా, కంస మామాగా తయారైనట్లు ఎద్దేవా చేశారు. ట్రిపుల్ ఐటిలకు సకాలంలో సరిపడా నిధులను మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి చెప్పారు. నిర్వహణ సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న, బద్రీ, రాఘవయ్య పాల్గొన్నారు. **విషపురుగులను నివారించాలి :** ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలోకి విష పురుగులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెసు పార్టీ పులివెందుల సమన్వయ కమిటీ సభ్యులు ధృవకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీ ఆవరణంలో గడ్డి పొదలు పెరిగి పోవడం వల్ల విష పురుగులు వస్తున్నాయని వాటిపై ఆర్‌జెయుకెటి అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వేమయ్య, ఆర్కే బద్రీ పాల్గొన్నారు.

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

**జమ్మలమడుగు :** మండలంలోని దానవులపడు గ్రామానికి చెందిన కె.వెంకటరమణ అనారోగ్యంతో మరణించారు. అంతిమ సంస్కరణలు చేయడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరె లక్ష్మణ్ రావు ముందుకొచ్చారు. శుక్రవారం హిందు శ్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరె లక్ష్మణ్ రావు, డి.శ్రీరామ్, సుబహన్, సురేష్, సుబ్బయ్యకు పలు వురు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సాయం చేయాలనుకునే దాతలు 91 82972 53484లో సంప్రది ంచాలన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

**ముద్దనూరు :** క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీరం దృఢంగా ఉంటుందని ఎంపిడిఒ సూర్య నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలోని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామ స్థాయి నుంచి క్రీడలకు సమున్నత ప్రోత్సాహం కల్పించి భవిష్యత్తులో ఐపిఎల్ జట్టులో ఉండేలా 46 రోజుల పాటు వివిధ క్రీడలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వీరభద్రుడు, కార్యదర్శి లక్ష్మి నరసింహులు, ఎంఇఒ నాయక్, పిడిలు, పిఇటీలు, సిబ్బంది పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. క్రికెట్, ఖోఖో ,వాలీబాల్, కబడ్డీ, బ్యాట్మెంటన్ క్రీడలకు సంబంధించి నిర్వహణ, టీంల విభజన వంటి తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రంతుల్లయ్య, తహశీల్దార్ నాగేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్, జిల్లా క్రీడా అధికారులు నూర్, శ్రీనివాసరాజు, అబ్దుల్ మునాఫ్, ఫిజికల్ డైరెక్టర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## అందరికీ రేషన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**పులివెందుల రూరల్ :** అందరికీ రేషన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల మున్సిపాలిటీకి 482 క్వింటాళ్ల 93 కేజీలు అదనపు బియ్యం రావడంతో శుక్రవారం పట్టణంలోని ప్రశాంతినగర్ సచివాలయం పరిధిలో ప్రజలకు తహశీల్దార్ మాధవ్ కృష్ణారెడ్డితో కలిసి రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని పట్టణంలో వేరే గ్రామాల నుంచి పులివెందులకు వచ్చిన వారికి పోర్టబిలిటీ కింద బియ్యం ఇవ్వడంతో పట్టణంలో కొన్ని కార్డులకు బియ్యం తక్కువ వస్తున్నాయని గమనించి అదనపు బియ్యం తెప్పించి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, జెసిఎస్ ఇన్‌ఛార్జి చంద్రమౌళి, కన్వీనర్ మధుసూదరెడ్డి, కౌన్సిలర్ రాజశేఖరరెడ్డి, ఆర్ఐ. సుజిత్, వాలంటీర్, గృహసారధి పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

**ఖాజీపేట :** అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మికి శుక్రవారం వినతి పత్రం అందించారు. అమరావతి గుంటూరులోని వారి కార్యాలయాల్లో కలిసి విన్నవించారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు కలిసి సమస్యలను విన్నవించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటీ, మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని , రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను రూ. 5 లక్షలకు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లను కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు జె. గంగావతి, బేబీ రాణి, లలితమ్మ, జ్యోతి, సుబ్బరావమ్మ, ప్రేమ పాల్గొన్నారు.

## లోకేష్‌ను కలిసిన ప్రవీణ్ సతీమణి

**ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి అక్రమ కేసులో అరెస్ట్ అయిన సందర్భంలో ఆయన సతీమణి మౌనిక టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిశారు. అక్రమ కేసు పూర్వాపరాలు, అరెస్టు, బెయిల్ పిటిషన్ మొదలగు విషయాలు పైన చర్చించారు. ఇదే సమయంలో ప్రవీణ్ కుమార్ రెడ్డి జైల్లో ఉన్నా వెనకడుగు వేయకుండా ధైర్యంగా పార్టీ నేతలకు, కార్యకర్తలకు, సామాన్య ప్రజలకు అండగా ఉండడమే కాక పార్టీ 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆగకుండా నడిపిస్తున్న ఆమెను, అక్క హరితని నారా లోకేష్ అభినం దించారు . ఇలాగే ధైర్యంగా ముందుకు సాగాలని, ఈ కేసు విషయంలో, తన తమ్ముడులాంటి ప్రవీణ్ విషయంలో అన్ని విధాలా అండగా ఉంటానని నారా లోకేష్, ప్రవీణ్ రెడ్డి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పరు.



## సైన్స్‌తోనే సమాజాభివృద్ధి : జెవివి

**జమ్మలమడుగురూరల్ :** సైన్సుతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో కరస్పాండెంట్ శేషారెడ్డి, జెవివి జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి మహేష్ నాయుడు చెకుముకి సైన్స్ ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ శాస్త్రీయంగా సైన్స్ పరంగా ఆలోచన చేయాలన్నారు. నేటి సమాజంలో చాలామంది విశ్వాసాలతో మూఢ నమ్మకాలతో కొనసాగుతున్నారు. విద్యార్థులు ప్రతి విషయాన్ని ప్రశ్నించాలన్నారు. సైన్స్ పరంగా ఆలోచించాలని, దేశం అభివృద్ధి చెందాలంటే అది సైన్స్ తోనే సాధ్యమని అన్నారు. పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్ష జమ్మలమడుగు నియోజకవర్గం వ్యాప్తంగా ఐదువేల మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు ఇస్తారన్నారు. ఈ ప్రశ్న పత్రాలు విడుదలలో వంశీ, కిరణ్, ప్రసాద్ మీ గుర్రం డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

**శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయం**
సుంకులగారిపల్లె (గ్రా), మైదుకూరు (మం), కడప జిల్లా.

**e-Procurement Tender**
**NIT NO. P1/1112/2023-54 Dt: 16.10.2023**

దేవాలయ పున: నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు : ధర్మకర్త

చెన్నూరు : పోటీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

## ఆటల పోటీల్లో ప్రతిభ చూపాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

విద్యార్థులు చదువుతో పాటు ఆటల పోటీల్లో తమ ప్రతిభను చూపాలని గ్రంథాలయ అధికారి వనజాకుమారి కోరారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మార్కెట్ వీధిలో ఉన్న ప్రభుత్వ మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు నిమ్మకాయ, రన్నింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు ఆయా పాఠశాలలో ఆటల పోటిలతో పాటు విద్యకు సంబంధించిన వకృత్వ, వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలో బహుమతులు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చెన్నూరు :** ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ నిర్వాహకుడు కె. హరి కృష్ణ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. దాదాపు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 18న 8, 9వ తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల విద్యా శాఖ అధికారి -1 డి. గంగిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ . పద్మనాభం, డ్రాయింగ్ టీచర్ ఎ.సి. వెంకటేశ్వర్లు, క్రాఫ్ట్ టీచర్ అర్. రంగనాయకులు, టీచర్లు వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు. చాపాడు : శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో పచ్చదనం పరిశుభ్రత గురించి జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రంథాలయ అధికారి జె శివశంకర్‌రెడ్డి, బిడిసి రవిశంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** పట్టణ పరిధిలోని సత్రంబడిలో శ నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని లైబ్రేరియన్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ పోటీలను ఏర్పాటు చేశారు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న లేఖర్ల నిరసన

**ప్రజాశక్తి - చాపాడు**

మైదుకూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద దస్తావేజులేఖర్ల చేపడుతున్న నిరసన శుక్రవారం నాలుగో రోజు కొనసాగింది. జిల్లాతో పాటు,రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్టర్ కార్యాలయాల పరిధిలో నాలుగు రోజులుగా దస్తావేజులేఖర్లు పెన్‌డౌన్‌చేసి నిరసన చేస్తున్నారు. నాలుగు రోజులుగా జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో ఆస్తులు అమ్మకందారులు, కొనుగోలుదారులు అయోమయంలో ఉన్నారు. దస్తావేజు రైటర్ల పెన్‌డౌన్‌తో నిత్యం రద్దీగా కనిపించే మైదుకూరు రిస్టర్ కార్యాలయం బోసిపోయింది . ప్రైమ్ 2.0 విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, పాత పద్ధతిని కొనసాగించాలని, మైదుకూరు దస్తావేజు రైటర్లు నినాదాలు చేస్తూ కార్యాలయ సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దస్తావేజు రైటర్లు సుధీర్, సామెల్, సుధాకర్, శ్రీనివాసులురెడ్డి, నారాయణ, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

వికాస్ విహార్‌లో అన్నదానం చేస్తున్న సేవా సమితి సభ్యులు

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు( పుట్టపర్తి సర్కిల్ )**

ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో జిమ్ ఇకో సర్వీసెస్ యాజమాన్యం జి.లక్ష్మీ పావని కుమారుడు జి.మోక్షిత్ పుట్టినరోజు సందర్భంగా అమ్మ నాన్న మదర్ థెరిస్సా వృద్ధాశ్రమం, దివ్యాంగులకు వికాస్ విహార్‌లో అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుసేన్ మాట్లాడుతూ దేవుడు జి.మోక్షిత్ చల్లగా చూడాలని మరెన్నో ఇలాంటి పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాక్షించారు. .70 మంది అనాధ పిల్లలకు అన్నదానం చేయడం మంచి కార్యమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి, స్కూల్ సిబ్బంది, మహిళా నాయకురాలు వెంకటలక్ష్మి, అల్తాఫ్, బాషా దివ్యాంగుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

## ఏకలవ్య ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె**

ఏకలవ్య ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జె.కొత్తపల్లె ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, సర్వే నిర్వహణ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ వారు వివిధ పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీస్తున్నారని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి సరిపడేలా తయారు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఏకలవ్య ఇన్‌ఛార్జి ఉపా ధ్యాయులు పి.చంద్రశేఖర్, ఇతర ఉపా ధ్యాయులు, ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్స్ నరేష్, సుబ్బయ్య, చింతకొమ్మదిన్నె ఎఫ్‌పిసి ఉపా ధ్యక్షులు ఓబులేసు డైరెక్టర్ సుబ్బయ్య, అకౌంటెంట్ శ్రీనివాసులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ కడప ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**

**E.P.No. 283/2019**
**DRK No. 114/2019**

M/S. మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రొద్దుటూరు. రెప్రెజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజరు/ ఫోర్‌మెన్.
...పిటిషనరు/D.Hr.

Vs

బి.చంద్రమోహన్‌రెడ్డి మరియు వగైరాలు.
...రెస్పాండెంట్స్/J.Drs

**రెస్పాండెంట్ నెం.5నకు Rule 54 నోటీసు**

R.No.5:- కందనూరు వెంకటసుబ్బారెడ్డి, తండ్రి కె.పెద్ద సుబ్బారెడ్డి, వయస్సు 36 సం॥లు, సాకిన్, డోర్‌నెం.1/167, లక్ష్మీపేట గ్రామం, చాపాడు మండలం, కడప జిల్లా.

పిటిషనరు/D.Hr., E.P. మొత్తం రూ.6,84,210/-లు మరియు దానికి అగు వడ్డీని రాబట్టుకొనుటకు గాను రెస్పాండెంట్ నెం.5 అయిన నీతాలుకు E.P. షెడ్యూల్ ఆస్తిని జప్తు చేయకోరుచు పై నెంబరు E.P.ని దాఖలు చేసియున్నారు. అట్టి E.P. నందు రెస్పాండెంట్ నెం.5 అయిన నీవు హాజరు అగుటకు గాను వాయిదా 29.11.2023వ తేదీన ఉంటువున్నది. కావున అట్టి దినం ఉదయం 10.30 గంటలకు నీవు పై రాజశ్రీ కోర్టు వారి ఎదుట ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని హాజరయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు లేని యెడల నీ పరోక్షమున E.P.ని తీర్మానించబడునని తెలియజేయడమైనది.

**వాయిదా తేది: 29.11.2023**

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

**G.SREENIVASULU NAIDU**
**Advocate,**
**KADAPA.**